సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 18 । జూలై । 2025



అయ్యో.. రొయ్య! 8లో



ప్రొఫెసర్ల భూమి.. ఎన్నారైలకు అమ్మేసి.. 8లో



'సాంకేతిక' విద్యార్థుల ఆందోళన 8లో

"నేను పీలా గోవిందును మాట్లాడుతున్నాను బ్రదర్. వెంగమాంబ క్రషర్‌లో నేను ఒన్ ఆఫ్ ది షేర్ హోల్డర్. దాని జోలికి వెళ్లక. ఎప్పటి నుంచో ఉంది. వాళ్ల ఫాదర్.... మా ఫాదర్ పార్ట్‌నర్స్. తెలియకపోతే తెలుసుకో. మన ఫ్యామిలీది అది. పర్మిషన్ లేనివి వంద ఉన్నాయి. నాది అనేటప్పుడు గొడవ పడతవు. పడు. నా మీద గౌరవం ఉంటే వదిలేయ్..."

ఇవి స్వయంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు!!

• నిస్సిగ్గుగా...'పీలా'పన

ఆ క్రషర్ మనదే... వదిలెయ్..!

వెంగమాంబలో పీలా గోవిందు పాత్ర బహిర్గతం



తాను భాగస్వామినంటూ స్వయంగా వెల్లడి

'దాని జోలికి వెళ్లకు' అని హెచ్చరిక

సమాచారం అడిగిన సమాజ్‌వాది పార్టీ నేతకు ఫోన్

'సాక్షి' చేతిలో ఆడియో రికార్డు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:



వెంగమాంబ క్రషర్స్‌లో జోరుగా సాగుతున్న కార్యకలాపాలు

మైనింగ్ వ్యవహారాలపై సమాచారం సేకరిస్తున్న సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన గురువయ్యకు పీలా గోవిందు ఫోన్ చేశారు. అక్రమంగా మైనింగ్ చేస్తున్న వెంగమాంబ క్రషర్స్‌లో భాగస్వామినంటూ ఆయనే స్వయంగా వెల్లడించారు. దాని జోలికి వెళ్లకని హెచ్చరించారు. ఆయన వాయిస్ రికార్డు 'సాక్షి'కి చిక్కింది. ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీయూఎఫ్ఐడీసీ) చైర్మన్‌గా వ్యవహరిస్తున్న పీలా గోవింద సత్యనారాయణ అక్రమ మైనింగ్‌లో భాగస్వామి అనే విషయం పై మాటల ద్వారా స్పష్టమవుతోంది. ఇన్ని రోజులుగా వెంగమాంబ స్టోన్ క్రషర్స్ తెరవెనుక ఉండి వ్యవహారాలను శ్రీనివాస చౌదరి చక్కబెడుతుండగా... అసలైన సూత్రధారి పీలా గోవిందని ఈ ఆడియో రికార్డుతో తేలిపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. శ్రీనివాస చౌదరి బీజేపీలో ఉండగా.... పీలా గోవిందు టీడీపీలో ఉండి అనకాపల్లి జిల్లాలో అక్రమ మైనింగ్ వ్యవహారాన్ని నడిపిస్తున్నారని స్పష్టమవుతోంది. అసలు అనుమతి లేని, కోర్టు పరిధిలో ఉన్న క్వారీలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌లో అధికార పార్టీకి చెందిన నేతలు తమ పాత్ర స్వయంగా ఒప్పుకోవడం గమనిస్తే ఆశ్చర్యమేస్తోంది. తాము అక్రమ మైనింగ్ చేస్తున్నామని వారే నోరు విప్పి చెబుతున్నారంటే.. తమపై ఎవ్వరూ చర్యలు తీసుకోలేరనే ధైర్యమే కారణమని, ఆ ధీమా వారి మాటల్లో కనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అనకాపల్లి అంతటా అక్రమ మైనింగే...!

అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా భారీగా అక్రమ మైనింగ్ వ్యవహారాలు నడుస్తున్నాయి. ఒక్క అనకాపల్లి మండలంలోనే ఏకంగా 30కి పైగా క్వారీల్లో అనుమతి లేకుండా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ఒక్క మండలంలోనే రోజుకు 1000 ట్రిప్పుల బండరాళ్లు అనకాపల్లి రూరల్ ప్రాంతంలోని వివిధ అధికార, అనధికార క్వారీల నుంచి మునగపాక మీదుగా రాంబిల్లిలోని నావికాదళ పనుల వరకూ ప్రతి రోజూ చక్కర్లు కొడుతున్నాయి. 32–36 టన్నుల సామర్థ్యం కలిగి ఉన్నా ఏకంగా 50 టన్నుల మేరకు భారీ బండరాళ్లు వేసుకుని తిరుగుతున్న ఈ టిప్పర్లను అటు మైనింగ్ అధికారులు కానీ, ఇటు రవాణాశాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులు కానీ కనీసం కన్నెత్తి చూడటం లేదు. ఇక చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలంలో చేపడుతున్న అధికార, అనధికార మైనింగ్ ద్వారా ప్రతి రోజూ పదుల సంఖ్యలో లారీల నుంచి కంకర తరలివెళుతోంది. గుర్తింపు ఉన్న క్వారీల నుంచి తరలిస్తున్న వాటికి సీనరేజి కింద ప్రభుత్వం వసూలు చేసే మొత్తానికి అదనంగా టన్నుకు రూ.250 వసూలు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని కూటమి నేత 'ఏపీ' ట్యాక్స్ పేరుతో అధికారికంగా వసూలు చేస్తుండటం గమనార్హం. తద్వారా ప్రతి రోజూ రూ.10 లక్షలు వసూలు చేస్తున్నారు. అంటే నెలకు రూ.3 కోట్ల మేర 'ఏపీ' ట్యాక్స్ పేరుతో వసూలు చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు నర్సీపట్నం నియోజకవర్గంలో ఏకంగా లేటరైట్‌కు అటవీ మార్గం గుండా రైట్ రైట్ చెబుతున్నారు. అసలు ఎంత మొత్తం తరలిస్తున్నారనే లెక్కలను కూడా మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. వారు చెప్పిందే లెక్క అనే రీతిలో అక్కడ వ్యవహారం నడుస్తోంది.

లంచాలకు అధికారులు సలాం!

కేవలం ఒక్క అనకాపల్లి మండలంలోని అక్రమ మైనింగ్ ద్వారానే మైనింగ్ అధికారులకు నెలవారీగా రూ.50 లక్షల చొప్పున ముట్టచెబుతున్నారనే ఆరోపణలున్నాయి. అందుకే అనుమతి లేని క్వారీల్లో కూడా అడ్డగోలుగా మైనింగ్ నడుస్తోంది. ఇక అనుమతి ఉన్న కొద్దిపాటి క్వారీల్లో అనుమతికి మించి మైనింగ్ జరుగుతోంది. ఈ వ్యవహారాలను చూసీచూడనట్టు ఉండేందుకుగానూ ప్రతి నెలా కేవలం మైనింగ్ అధికారులకే రూ.50 లక్షల చొప్పున ముట్టచెబుతున్నారనే విమర్శలున్నాయి. ఇక రవాణా, రెవెన్యూ అధికారులకూ ఇందులో వాటాలు ఉండటంతో కిమ్మనకుండా ఉంటున్నట్టు తెలుస్తోంది. మరోవైపు మొదట్లో అనుమతికి మించి లోడుతో వస్తున్నాయంటూ లారీలను నిలిపిన పోలీసు అధికారులు కూడా ఇప్పుడు అటువైపు కనీసం కన్నెత్తి చూడటం లేదు. వారికి వాటా ముడుతుండటంతోనే పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తద్వారా సహజ సంపదను ఇష్టారాజ్యంగా కూటమి నేతలు అందినకాడికి దోచుకుంటున్నారు.

ఫోన్ చేసి నాదే అని చెప్పారు

అనకాపల్లి మండలంలోని అక్రమ మైనింగ్‌పై ఆర్‌టీఐ ద్వారా సమాచారం అడిగాను. వెంగమాంబ క్వారీ జోలికి వెళ్లక అని పీలా గోవిందు ఫోన్ చేశారు. అందులో తనకు వాటా ఉందని చెప్పారు. తన తండ్రి కాలం నుంచే శ్రీనివాస చౌదరి తండ్రితో వ్యాపార భాగస్వామ్యం ఉందని నాకు ఫోన్‌లో చెప్పారు. అక్రమ మైనింగ్ నడుస్తోందని నేను అంటే ఇలాంటివి బోలెడున్నాయని కూడా అన్నారు. ఇలా ఫోన్ చేయడం ఎలా కరెక్ట్?

– కోన గురువయ్య, సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో చోటు



సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో విశాఖ జిల్లాకు చెందిన పలువురికి చోటు లభించింది. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఐటీ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా చిమట లావణ్య(భీమిలి), వైఎస్సార్‌టీయూసీ జోనల్ ప్రెసిడెంట్‌గా పి.వి.సురేష్(విశాఖ వెస్ట్), వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నక్కా వెంకట రమణ(గాజువాక), వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శులుగా బడిదబోయిన చినఅప్పారావు(విశాఖ సౌత్), కోలా శివ ప్రసాద్(విశాఖ వెస్ట్), వైఎస్సార్‌టీయూసీ జాయింట్ సెక్రటరీగా బడుగు సాయిచంద్(విశాఖ వెస్ట్), బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ తుళ్లి చంద్రశేఖర్ యాదవ్(విశాఖ నార్త్), పోలవరపు శ్రీనివాస్(విశాఖ వెస్ట్), క్రిస్టియన్ మైనారిటీసెల్ జాయింట్ సెక్రెటరీ ఊతపల్లి వేలంగిరావు(విశాఖ సౌత్)ను నియమించారు.

జోన్-1 ఈఈగా శ్రీనివాసరావు బాధ్యతలు



ఈఈ శ్రీనివాసరావుని అభినందిస్తున్న ఈపీడీసీఎల్ ఉద్యోగులు

సాక్షి, విశాఖపట్నం : ఈపీడీసీఎల్ విశాఖపట్నం సర్కిల్ జోన్-1 డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పోలాకి శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సర్కిల్ కార్యాలయంలో ఈఈగా పనిచేసిన సింహాచలం నాయుడు జోన్-3కి బదిలీ అయ్యారు. తర్వాత ఇన్‌చార్జ్‌గా వేణుగోపాల్ వ్యవహరించారు. ఆయన స్థానంలో శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. పాత నగరం, వాల్తేర్, దొండపర్తి, సీతమ్మధార తదితర ప్రాంతాలకు చెందిన ఈపీడీసీఎల్ అధికారులు, విద్యుత్ సంఘాల నాయకులు ఆయన్ని అభినందించారు. డీజీఎం కృష్ణకుమారి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎస్.సుమన్, శిరీషా గాయత్రి, జ్యోతి, విద్యాసాగర్, ఏఈలు, జేఈలు సిబ్బంది పాల్గొన్నారు.

కైలాసగిరి-భీమిలి రహదారి విస్తరణపై అభ్యంతరాలు

విశాఖ సిటీ: కైలాసగిరి నుంచి భీమిలి వరకు 28 కిలోమీటర్ల రహదారి విస్తరణ, దీనికి ఆనుకొని మెట్రోరైల్ ప్రతిపాదనపై తమకు అభ్యంతరాలు, సందేహాలు ఉన్నట్లు మత్స్యకారుల యువజన సంక్షేమ సంఘం కార్యదర్శి తెడ్డు శంకర్ వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ రహదారి విస్తరణ, మెట్రో రైలు పనులకు భూ సేకరణ ఏ విధంగా చేస్తారని, తమ నివాసాలకు నష్టపరిహారం ఎవరు ఇస్తారని, మత్స్యకారుల ఉపాధికి స్థలాలు ఎక్కడ కేటాయిస్తారని తెలియజేయాలన్నారు. అలాగే భూసేకరణ చట్టం-2013 ప్రకారం భూములను సేకరించాలని విజ్ఞప్తి చేశారు. అన్నింటిపైనా రాత పూర్వకంగా ఇచ్చిన తర్వాత 60 మీటర్ల రహదారి విస్తరణ, మెట్రో రైలు ప్రతిపాదనకు బృహత్ ప్రణాళిక-2041కి ఆమోదం తెలపాలని కోరారు.

డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యువల్‌కు దరఖాస్తులు

మద్దిలపాలెం: డిగ్రీ కళాశాలల్లో 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యువల్ కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. విజయ బాబు తెలిపారు. జోన్-1 పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ, ప్రైవేట్ ఓరియంటల్ డిగ్రీ, ఎయిడెడ్ కళాశాలల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్న అధ్యాపకులను పునరుద్ధరించడానికి రాజమహేంద్రవరంలోని ప్రాంతీయ విద్యా సంయుక్త సంచాలకుడు, కళాశాల విద్యా శాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఆదేశాల మేరకు 2024–25 విద్యా సంవత్సరంలో 2025 జూలై 19వ తేదీ వరకు ఒప్పంద అధ్యాపకులుగా పనిచేసిన వారు మాత్రమే రెన్యూవల్‌కు అర్హులు. 2025–26 విద్యా సంవత్సరంలో పని చేయడానికి రెన్యువల్ కోరుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తులను ఈ నెల 20న జిల్లా ఐ.డి. కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలి. ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యువల్ కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. కౌన్సెలింగ్ అనంతరం, 2025–26 విద్యా సంవత్సరానికి రెన్యూవల్ అయిన కాంట్రాక్ట్ లెక్చరర్లు అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంటుందని విజయబాబు స్పష్టం చేశారు.

జీవీఎంసీకి స్వచ్ఛ పురస్కార్

సఫాయి మిత్ర సురక్షిత్ షెహర్ ప్రత్యేక కేటగిరీలో ప్రథమ స్థానం



కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మేయర్ పీలా శ్రీనివాస్, కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: స్వచ్ఛభారత్ మిషన్ 2.0లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ 2024కు గానూ జీవీఎంసీ జాతీయ స్థాయి స్వచ్ఛ పురస్కారాన్ని దక్కించుకుంది. సఫాయి మిత్ర సురక్షిత్ షెహర్ ప్రత్యేక కేటగిరీలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. దేశ రాజధాని ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్-2024 అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ చేతుల మీదుగా మేయర్ పీలా శ్రీనివాసరావు, రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్‌తో కలిసి ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రత్యేక కేటగిరీలో జీవీఎంసీ ప్రథమ స్థానం సాధించడం విశాఖ నగరానికి ఎంతో గౌరవమన్నారు. ఈ ఘనత సాధించడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో ఉందని, ఇందుకు సహకరించిన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్లు, నివాసిత సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, జీవీఎంసీ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో స్వచ్ఛ సర్వేక్షణ్-2025లో కూడా జీవీఎంసీ ఉత్తమ పరిశుభ్ర నగరంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ప్రధాన ఇంజినీర్ పల్లంరాజు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల భర్తీకి దరఖాస్తులు

సీతంపేట: విశాఖ జిల్లాలో ఆశ వర్కర్ల నియామకానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు వివిధ పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో ఖాళీగా ఉన్న 58 ఖాళీలు భర్తీ చేయనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులు గ్రామీణ ప్రాంతాల్లో అదే గ్రామంలో, పట్టణ ప్రాంతాల్లో మురికివాడల్లో నివాసితులై ఉండాలన్నారు. 25–45 ఏళ్ల మధ్య వయసుండి, టెన్త్/ ఇంటర్ విద్యార్హతలున్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ఆగస్ట్ 15 నుంచి ప్రారంభమయ్యేనా..?

- దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలపై వీడని సందిగ్ధత
- నత్తనడకన జోన్ కార్యాలయ నిర్మాణ పనులు
- జీఎం చాంబర్ కోసం తొలుత పాత ఓఎస్డీ కార్యాలయం ఎంపిక
- ఇప్పుడు వీఎంఆర్డీఏ డెక్‌లో స్పేస్ ఇవ్వాలని లేఖ రాసిన వాల్తేరు అధికారులు
- రైల్వే బిల్డింగ్‌లోనే తాత్కాలిక కార్యాలయం ఏర్పాటుకు బోర్డు మొగ్గు



సాక్షి, విశాఖపట్నం : ఒక అడుగు ముందుకు.. మూడడుగులు వెనక్కి అన్న చందంగా మారింది దక్షిణ కోస్తా రైల్వే జోన్ వ్యవహారం. సుదీర్ఘ పోరాటం తర్వాత జోన్ ప్రకటన వచ్చి.. ఆరేళ్లు దాటినా కార్యకలాపాలు మాత్రం ఇంతవరకూ ప్రారంభం కాకపోవడం విడ్డూరం. అధికార పార్టీ చేతిలో రాజకీయ పాచికగా మారిపోయిన జోన్‌కు జీఎంని నియమించి దాదాపు నెల రోజులు దాటినా.. ఆయన బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎక్కడ ఉండాలో కూడా తెలియని పరిస్థితి దాపురించింది. ఓవైపు జోన్ ప్రధాన కార్యాలయ పనులు నత్తనడకగా సాగుతుండటం.. మరోవైపు తాత్కాలిక కార్యాలయ అన్వేషణ కూడా అదే తరహాలో జరుగుతుండగా.. ఆగస్ట్ 15 నుంచి కార్యకలాపాలు ప్రారంభించాలన్న రైల్వే బోర్డు యోచనపైనా సందిగ్ధత కొనసాగుతోంది.

కదలని ఆపరేషన్స్

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథుర్‌ని రైల్వే శాఖ గత నెల 5న నియమించింది. అదే రోజున ఆయన ఢిల్లీలో బాధ్యతలు చేపట్టారు. 10 రోజుల తర్వత విశాఖకి వచ్చి.. వాల్తేరు డివిజన్ అధికారులతో డీఆర్ఎం కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంలోనే తాత్కాలిక కార్యకలాపాల ప్రారంభంపైనా చర్చలు కొనసాగాయి. ఆగస్ట్ 15 నుంచి ఆపరేషన్స్ మొదలు పెట్టాలని రైల్వే బోర్డు సూచించినట్లు తెలుస్తోంది. అందుకే.. ప్రధాన కార్యాలయ నిర్మాణానికి రెండేళ్లకు పైగా సమయం పట్టే అవకాశం ఉండటంతో.. తాత్కాలిక కార్యాలయాన్ని ఎంపిక చేసి.. జోన్ కార్యకలాపాల్ని ప్రారంభించాలని భావించారు. అయితే.. ఇంతవరకూ ఎంపికపై ఎలాంటి స్పష్టత రాకపోవడం గమనార్హం. దీంతో జోన్‌కు జనరల్ మేనేజర్‌ను నియమించి నెల దాటినా ఆపరేషన్స్ మాత్రం అడుగు ముందుకు పడటం లేదు.

గెజిట్ ఇంకా విడుదల కాలేదు..

ఆగస్టు 15 నుంచి విశాఖలో జీఎం తాత్కాలిక కార్యాలయం ప్రారంభమవుతుందని అంతా భావిస్తున్నారు. ఈలోగా ఆఫీస్‌ని ఎంపిక చేసి జీఎం కార్యాలయానికి అనుగుణంగా మార్పులు చేయాల్సి ఉంటుంది. అయితే దీనికి సంబంధించి ఇంతవరకూ ఎలాంటి స్పష్టత రాలేదని వాల్తేరు అధికారులు చెబుతున్నారు. జోన్‌కు సంబంధించిన గెజిట్ కూడా ఇంతవరకూ విడుదల చేయలేదు. గెజిట్‌తో కార్యాచరణ ప్రకటిస్తే జీఎంతో పాటు అసిస్టెంట్ జీఎం, ఇతర 10 విభాగాలు, వాటి ప్రిన్సిపల్ హెచ్‌వోడీలు, సంబంధిత అధికారులు సిబ్బంది సహా మొత్తంగా 180 మంది వరకూ అధికారులు, ఉద్యోగులు వస్తారు.

ఎక్కడ కూర్చోవాలి ?

జీఎం కార్యాలయానికి భవన ఎంపికపై వాల్తేరు డివిజన్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. తొలుత డీఆర్ఎం కార్యాలయాన్ని ఎంపిక చేశారు. అయితే జీఎం స్థాయిలో అక్కడ వసతులు లేవని భావించారు. తర్వాత దక్షిణ కోస్తా జోన్ డీపీఆర్ తయారు చేసేందుకు నియమించిన ఓఎస్డీ కోసం రైల్వే స్టేషన్ 8వ ప్లాట్‌ఫారం సమీపంలో జ్ఞానాపురం వైపు ఓ కార్యాలయాన్ని అప్పగించారు. ప్రస్తుతం ఆ భవనం ఖాళీగా ఉంది. అక్కడ ఏర్పాటు చేయాలని అనుకున్నా.. జీఎం చాంబర్‌కు, సరిపడా సిబ్బందికి అవసరమైన గదులు లేకపోవడంతో ఆలోచన చేస్తున్నారు. ఇంతలో వీఎంఆర్‌డీఏ కొత్తగా నిర్మించిన డెక్‌లో స్థలం కావాలంటూ వాల్తేరు రైల్వే అధికారులు వీఎంఆర్‌డీఏకు లేఖ రాశారు. ప్రస్తుతం ఇది పరిశీలనలో ఉంది. అయితే బోర్డు మాత్రం రైల్వేకు సంబంధించిన ఆస్తుల్లోనే తాత్కాలిక కార్యాలయం కూడా ఉండేలా చూడాలని సూచించడంతో.. ఇప్పటివరకు జీఎం ఆఫీస్ ఎంపిక ప్రక్రియ పూర్తి కాలేదు. దీంతో జోన్ జనరల్ మేనేజర్ మళ్లీ విశాఖ వైపు కూడా చూడలేదు. వచ్చి బాధ్యతలు చేపట్టాక ఎక్కడ కూర్చోవాలనే అంశం ఇంకా కొలిక్కి రాకపోవడంతో ఢిల్లీ నుంచి ఫోన్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎప్పటికప్పుడు ఇక్కడి అధికారులతో సమావేశమవుతున్నట్లు తెలుస్తోంది.

వీరందరి నియామకం జరిగిన తర్వాతే జోన్ ఆపరేషన్స్ మొదలయ్యే అవకాశాలున్నాయి. తొలుత జీఎం చాంబర్‌ని ఎంపిక చేసి.. వాల్తేరు డివిజన్ పరిధిలో ఉన్న అధికారులు, ఉద్యోగులతో మిగిలిన వ్యవహారాలు నడిపించాలని రైల్వే శాఖ భావిస్తోంది.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే పట్టాల రద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

విశాఖ సిటీ : జిల్లాలో పేద, బలహీనవర్గాల కోసం నిర్మిస్తున్న గృహ నిర్మాణాల ప్రగతిని వేగవంతం చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ సంస్థ చేపడుతున్న పేదల గృహాల పరిస్థితి, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని గ్రామ సచివాలయాల్లో వచ్చే వారంలో గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. ఈ గ్రామ సభలకు ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏమినిటీస్ సెక్రటరీ, హౌసింగ్ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు హాజరు కావాలని స్పష్టం చేశారు. ఇంకా ఇళ్ల నిర్మాణం ప్రారంభించని వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణం చేపట్టకపోతే ఇచ్చిన ఇళ్ల పట్టాలతో పాటు మంజూరైన ఇళ్లు రద్దు చేయడం జరుగుతుందనే విషయం లబ్ధిదారులకు చేరాలన్నారు. సభ జరిగిన ఒక వారంలో ఇంటి నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రాకపోతే నోటీసులు జారీ చేసి ఇళ్లు రద్దు చేయాలని తేల్చి చెప్పారు. వచ్చే ఏడాది నాటికి జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ లేఅవుట్లలో పూర్తి స్థాయి లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాల్లో నాణ్యత లోపి స్తే గృహ నిర్మాణ శాఖ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హౌసింగ్ పీడీ సత్తిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యామ్ బాబు, జీవీఎంసీ ఎస్ఈ రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో బంగారు కుటుంబాల మ్యాపింగ్

విశాఖ సిటీ: జిల్లాలో పీ4 కార్యక్రమంలో భాగంగా వారం రోజుల్లో బంగారు కుటుంబాలకు మార్గదర్శుల మ్యాపింగ్ పూర్తవుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు కలెక్టర్ హరేందిర ప్రసాద్ వివరించారు. సీఎస్ సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్, ప్రజా స్పందన, స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర, ఎంఎస్ఎంఈ పార్కులు, ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్షించారు. జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పీ4 అంశంపై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బంగారు కుటుంబాలు, ఔత్సాహిక మార్గదర్శుల ఎంపిక పూర్తయిందన్నారు. వారం రోజుల్లో వారి మ్యాపింగ్ కూడా పూర్తవుతుందని తెలిపారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'అతిథి' ని'బంధనాలు'



- ఏయూ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాలపై వీసీ 'వెబ్' శాసనం
- ఆరు నెలలలోపే తమ ఆశల్ని కాలరాస్తున్నారంటూ ఆవేదన
- రివ్యూ విధానమే కొనసాగించాలని గెస్ట్ ఫ్యాకల్టీల ఆందోళన

మద్దిలపాలెం: ఆంధ్ర యూనివర్సిటీలో అతిథి అధ్యాపకుల నియామక ప్రక్రియ వివాదాస్పదమవుతోంది. కూటమి ప్రభుత్వం ఏరికోరి వీసీగా తీసుకొచ్చిన ఆచార్య జీపీ రాజశేఖర్ జారీ చేసిన వెబ్ నోటిఫికేషన్ ప్రస్తుత అతిథి అధ్యాపకుల పాలిట శాపంగా మారింది. దీంతో కొత్త విధానం వద్దు.. గతంలో ఉన్న రివ్యూ విధానాన్నే కొనసాగించాలంటూ అతిథి అధ్యాపకులు ఆందోళన బాట పట్టారు.

ఆరు మాసాల ముచ్చట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏయూ ఇన్‌చార్జి వీసీగా ఆచార్య శశిభూషణ్‌రావును నియమించారు. ఆయన సిక్స్ మెన్ కమిటీ నేతృత్వంలో ఒక్కో పేపర్‌కు ఒక్కొక్కరి చొప్పున 250 మందిని గెస్ట్ ఫ్యాకల్టీలుగా నియమించారు. ఆర్ట్స్ కళాశాలలో వివిధ దశల్లో మరో 138 మందిని తీసుకున్నారు. ఇది జరిగి ఆరు మాసాలే అవుతోంది. ప్రస్తుత వీసీ ఈ విధానానికి తిలోదకాలిస్తూ మొత్తం గెస్ట్ ఫ్యాకల్టీల భర్తీకి వెబ్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ నెల రోజులుగా ఏయూలో వివిధ రూపాల్లో గెస్ట్ ఫ్యాకల్టీలు ఆందోళనలు చేస్తున్నారు. మంత్రులు, నేతలను వేడుకుంటున్నారు.

రెండు పేపర్లు.. ఒక ఫ్యాకల్టీ!

ప్రస్తుత వీసీ ఆధ్వర్యంలో ఒక ఫ్యాకల్టీ-రెండు పేపర్లు విధానం కొనసాగుతోంది. దీంతో సగం మంది గెస్ట్ ఫ్యాకల్టీలు అవకాశం కోల్పోతున్నారు. ఇప్పటి వరకూ పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. వీరిలో ఎవరు కొనసాగుతారో? తెలియని అయోమయం నెలకొంది.

ఐఐటీ ప్రొఫెసర్లతో ఇంటర్వ్యూలు

ప్రస్తుత వీసీ సెంట్రల్ యూనివర్సిటీ ఐఐటీ ప్రొఫెసర్లతో ఇంటర్వ్యూలు చేయిస్తున్నారు. కెరియర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌లో ఇటీవల జరిగిన పదోన్నతులను ఇంటర్వ్యూ ప్రక్రియలోనే చేపట్టారు. వాస్తవంగా పదోన్నతులకు విభాగాధిపతుల చైర్మన్, బీవోఎస్ చైర్మన్, సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌తో కమిటీ ఉంటుంది. ఈ విధానాన్ని పక్కన పెట్టేశారు. ఏయూ విధి విధానాలను అమలు చేయకుండా ప్రస్తుత వీసీ తన ఐఐటీ విధానాలను అమలు చేస్తున్నారంటూ యూనివర్సిటీ వర్గాలు మండిపడుతున్నారు. దీన్నే అతిథి అధ్యాపకుల నియామకాల్లోనూ అనుసరిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

ఎస్సీ కమిషన్ సభ్యుడికి వినతి



జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు దయాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న అతిథి అధ్యాపకులు

తమకు న్యాయం చేయాలంటూ జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వాడపల్లి దయాకర్‌ను ఏయూ అతిథి అధ్యాపకులు వేడుకున్నారు. సిరిపురంలోని ప్రభుత్వ అతిథి గృహంలో గురువారం ఆయన్ని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు. గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం జరిగి 6 నెలలు గడవక ముందే మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని, తమకు రెన్యువల్/రివ్యూస్ విధానం అమలు చేసేలా యూనివర్సిటీ అధికారులను ఆదేశించాలని కోరారు. దయాకర్‌ను కలిసిన వారిలో అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డా.ఎం.సురేష్ మీనన్, డా.తుళ్లి చంద్రశేఖర్ యాదవ్, డా.రామ్, తదితరులున్నారు.

గతంలో నియామకాలిలా..

కళాశాల ప్రిన్సిపాల్ చైర్మన్‌గా, విభాగాధిపతులు, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌లు సభ్యులుగా ఒక కమిటీ ద్వారా అతిథి అధ్యాపకుల నియామకాలు జరిగేవి. ఏటా వారి పనితీరును రివ్యూ చేసి, పనితీరు బాగున్నవారిని కొనసాగించేవారు. ప్రస్తుత వీసీ కొత్తగా డీన్ ద్వారా నియామకాలు చేపట్టేందుకు పాత కమిటీని పూర్తిగా పక్కన పెట్టేశారు. ఇది యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధమని అతిథి అధ్యాపకులు ఆక్షేపిస్తున్నారు.

పాత విధానాన్నే కొనసాగించాలి

యూనివర్సిటీ యాక్ట్ ప్రకారం గతంలో మాదిరే గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం జరగాలి. వెబ్ నోటిఫికేషన్ విధానాన్ని రద్దు చేయాలి. అప్పుడే అందరికీ న్యాయం జరుగుతుంది. దీనిపై గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నాం. ఇప్పటికైనా వీసీ మా గురించి ఆలోచించాలని వేడుకుంటున్నాం.

– ఎం.సురేష్‌మీనన్, అధ్యక్షుడు, ఏయూ అతిథి అధ్యాపకుల సంఘం

అయ్యో.. రొయ్య!

- రొయ్యల ధర తగ్గింపుతో ఆందోళనలో మత్స్యకారులు
- గిట్టుబాటు కావడం లేదంటున్న గంగపుత్రులు
- ధర పెంచాలని, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్





మహారాణిపేట: అలల మీద ఆశలతో.. ప్రాణాలను పణంగా పెట్టి రోజుల తరబడి సముద్రంలో వేటాడితే.. తీరానికి చేరాక వారి కష్టానికి దక్కేది కన్నీళ్లే. విశాఖ మత్స్యకారుల బతుకులు ప్రస్తుతం ఇలాగే మారాయి. ముఖ్యంగా రొయ్యల వేటపై ఆధారపడిన మత్స్యకార కుటుంబాలు.. ఎగుమతిదారులు, మధ్యవర్తులు కలిసి ఆడుతున్న ధరల నాటకంలో నలిగిపోతున్నాయి. పెట్టిన పెట్టుబడి కూడా రాక.. చేసిన అప్పులు తీర్చలేక సముద్రమంత శ్రమ.. బూడిదలో పోసిన పన్నీరవుతోందని గంగపుత్రులు గగ్గోలు పెడుతున్నారు.

ఎగుమతిదారుల ఏకపక్ష వైఖరి

ఒకప్పుడు విశాఖ కేంద్రంగా 8 మంది ఎగుమతిదారులు రొయ్యలు కొనుగోలు చేసేవారు. దీంతో పోటీ ఉండి, మత్స్యకారులకు మంచి ధర లభించేది. కానీ ఇప్పుడు ఆ సంఖ్య కేవలం మూడుకు పడిపోయింది. ఈ ముగ్గురూ సిండికేట్‌గా మారి ధరలను శాసిస్తున్నారని, వారికి తోడు మధ్యవర్తులు కూడా తమ కమీషన్ల కోసం మత్స్యకారుల పొట్ట కొడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'సముద్రంలో దొరికే నాణ్యమైన రొయ్యల కన్నా.. ఆక్వా కల్చర్ రొయ్యలకే ఎగుమతిదారులు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొన్నిసార్లు మేము తెచ్చిన రొయ్యలను కొనడానికి కూడా ఇష్టపడటం లేదు. దీంతో తెచ్చిన సరుకు అమ్ముడుపోక, అప్పుల పాలవుతున్నాం' అని ఓ మర పడవ యజమాని తన ఆవేదన వ్యక్తం చేశాడు. మధ్యవర్తులు అవసరానికి అప్పులిచ్చి, ఆ తర్వాత ధర నిర్ణయంలో చక్రం తిప్పుతూ మత్స్యకారులను నిలువునా దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పెట్టుబడి భారమాయే..

గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం రొయ్యల ధరలను ఎగుమతిదారులు భారీగా తగ్గించేశారు. ఇది మత్స్యకారుల నడ్డి విరుస్తోంది. బోటుకు డీజిల్, కళాసీల జీతాలు, వలల మరమ్మతులు, ఐస్, రేషన్ ఖర్చులు తడిసి మోపెడవుతుంటే.. తీరా అమ్మకానికి వచ్చేసరికి ధరలు పాతాళంలోకి పడిపోయాయని వారు వాపోతున్నారు.

ధరల పతనంతో తీరని నష్టం

రొయ్య రకం	గత ఏడాది ధర	ప్రస్తుత ధర	నష్టం
బ్రౌన్ రొయ్య	420	300	120
వైట్ రొయ్య	550	400	150
ఫ్లవర్ రొయ్య	550	500	50
టైగర్ రొయ్య	1200	1150	50

పట్టికలో చూస్తేనే అర్థమవుతోంది నష్టం ఏ స్థాయిలో ఉందో.! ముఖ్యంగా ఎక్కువగా దొరికే బ్రౌన్ రొయ్యపై ఏకంగా రూ.120 తగ్గించడం దారుణమని, కనీసం కిలోకు రూ.400 అయినా ఇవ్వాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. కానీ.. వారి మాట వినే నాథుడే కరువయ్యాడు.

రొయ్యల ధర గిట్టుబాటు కావడం లేదు

రొయ్యల ధర గిట్టుబాటు కాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రస్తుతం 3 నుంచి 5 మంది ఎగుమతిదారులు మాత్రమే రొయ్యలను కొనుగోలు చేస్తుండటంతో మాకు సరైన ధర లభించడం లేదు. పైగా ఈ ఏడాది రొయ్యల ధరలు దారుణంగా పడిపోయాయి. గత ఏడాది ఇచ్చిన ధర కంటే ఇప్పుడు మరింత తగ్గిస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. ఎక్కువ మంది ఎగుమతిదారులు రొయ్యలను కొనుగోలు చేసేలా ప్రోత్సహించాలి.

– **పీసీ అప్పారావు**, గౌరవ అధ్యక్షుడు ఏపీ మరపడవల సంఘం

స్టోరేజ్ సదుపాయం కల్పించాలి

రొయ్యలను తగినంత నిల్వ చేసుకునే సదుపాయం లేకపోవడం వల్ల నష్టపోతున్నాం. దీంతో ఎగుమతిదారులు తమకు నచ్చిన ధరలు నిర్ణయిస్తున్నారు. ఒక్కోసారి వేటాడి తెచ్చిన రొయ్యలను కొనుగోలు చేయడానికి నిరాకరిస్తున్నారు. ఆక్వా కల్చర్ రొయ్యల కొనుగోలుపై చూపిస్తున్న శ్రద్ధ సముద్రం నుంచి వేటాడి తెచ్చిన రొయ్యలపై చూపించడం లేదు. సముద్రపు రొయ్యలకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నప్పటికీ, ఎగుమతిదారులు సహకరించకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రొయ్యలకు తగినంత స్టోరేజ్ సదుపాయాలను కల్పించాలి.

– **సూరాడ సత్యనారాయణ**, మత్స్యకారుడు

ప్రభుత్వమే ఆదుకోవాలి

విశాఖ జిల్లాలో 65 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. జిల్లాలో మొత్తం 2,547 అన్ని రకాల బోట్లు ఉన్నాయి. సుమారు 1.15 లక్షల మత్స్యకార కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఫిషింగ్ హార్బర్‌లో నెలకొన్న తాజా పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలి. మత్స్యశాఖ అధికారులు చొరవ తీసుకుని, ఎగుమతిదారులు, మరపడవల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధర కల్పించాలి. సముద్రంలో వేటాడి తెచ్చిన రొయ్యలను ఎగుమతిదారులు తప్పనిసరిగా కొనుగోలు చేసేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు. లేకపోతే తమ బతుకులు సముద్రంలో కలిసిపోవడం ఖాయమని ఆవేదన చెందుతున్నారు.

ప్రొఫెసర్ల భూమి.. ఎన్నారైలకు అమ్మేసి..

- ఫేస్‌బుక్ ద్వారా పరిచయం పెంచుకుని రూ.53.78 లక్షలకు టోకరా
- బాధితుడి ఫిర్యాదుతో ఇద్దరి అరెస్ట్

మధురవాడ: ఫేస్‌బుక్ ద్వారా రియల్ ఎస్టేట్ ఏజెంట్లుగా పరిచయం చేసుకుని.. ముగ్గురు రిటైర్డ్ ప్రొఫెసర్లకు చెందిన భూమిని తమదిగా చూపించి.. ఓ ఎన్నారై దంపతులకు అమ్మేసిన ఇద్దరిని గురువారం పీఎంపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను విశాఖ నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు మీడియా సమావేశంలో వెల్లడించారు.

విశాఖపట్నానికి చెందిన వాడుకుల మణికుమారి, వాడుకుల ప్రసాదరావు దంపతులు ఉద్యోగరీత్యా ఖతర్‌లో నివసిస్తున్నారు. వీరు విశాఖలో స్థలం కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో ఫేస్‌బుక్‌లో వాటి వివరాలు, ధరలను పరిశీలిస్తున్నారు. ప్రసాదరావు స్థలాల కోసం వెతకడాన్ని గమనించిన పిల్లి అశోక్ (మునగపాక వాస్తవ్యుడు, ప్రస్తుతం ఖతర్ నివాసి) తాను రియల్ ఎస్టేట్ ఏజెంట్‌నని పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత మల్కాపురానికి చెందిన ఎజ్జల శ్రీనివాస్ అలియాస్ దుబాయ్ శ్రీను అలియాస్ దుర్గామహేశ్వరరావును పరిచయం చేశాడు. అతను 'మెస్సర్స్ ఎంజ్ గ్రూప్'అధినేత అని, తామిద్దరం విదేశాల్లో నివసించే విశాఖవాసులకు స్థలాలు అమ్మడం, కొనడం వంటి పనులు చేస్తుంటామని నమ్మబలికారు. మధురవాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 4పీ, టీచర్స్ లేఅవుట్, ఎంజీ 50లో ఉన్న 311.11 గజాల ప్లాట్‌లో సగభాగం(155.55 గజాలు) అమ్మకానికి ఉందని నిందితులు తెలిపారు. ఆ స్థలం కొండేటి మీనాక్షి, కొండేటి రూప్ కుమార్‌ల పేర్ల మీద ఉందని, వాళ్లే నిజమైన వారసులని నమ్మించారు. ఆన్‌లైన్‌లో చెబితే ఎలా నమ్మాలని ప్రసాదరావు ప్రశ్నించగా.. 'మీరు స్థలం తీసుకోవడానికి అంగీకరిస్తే.. ముందుగా మీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తాం. ఆ తర్వాతే డబ్బు పంపితే చాలు' అని నిందితులు చెప్పడంతో ప్రసాదరావు అంగీకరించారు. ఇరువురి మధ్య ఒప్పందం కుదరడంతో 2024 జూలై 30న వాడుకుల నాగమణి పేరు మీద టీచర్స్ లేఅవుట్‌లోని 155.55 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో బాధితులు గత సంవత్సరం జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో దఫదఫాలుగా దుబాయ్ శ్రీను బ్యాంకు ఖాతాకు రూ.53,78,875 లను ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేశారు. ఇటీవల విశాఖ వచ్చిన బాధితులు తమ స్థలాన్ని చూసుకునేందుకు ప్రయత్నించగా.. అసలు ఆ స్థలానికి, దానిని అమ్మినవారికి ఎలాంటి సంబంధం లేదని, తాము మోసపోయామని గ్రహించారు. తమ డబ్బు తిరిగి ఇవ్వాలని నిందితులను కోరినా ప్రయోజనం లేకపోయింది. దీంతో బాధితులు ఈ నెల 12న పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన సీఐ బాలకృష్ణ, ఎస్ఐ భాస్కరరావులు.. నిందితులు నకిలీ పత్రాలతో బాధితులను మోసగించినట్లు నిర్ధారించారు. రిటైర్డ్ ప్రొఫెసర్లు అయిన కొండేటి రూప్‌కుమార్, నిమ్మగడ్డ నాగేశ్వరరావు, కొల్లిపర వెంకట దినకర్‌లకు చెందిన టీచర్స్ లేఅవుట్‌లోని ఎంజీ 49, 50, 51 ప్లాట్లకు చెందిన 900 గజాల భూమిని..155.55 గజాల చొప్పున ఆరు భాగాలుగా విభజించి అమ్మడానికి నిందితులు ప్రయత్నించినట్లు తేలింది. ఇందులో ఒక భాగాన్ని ప్రసాదరావు దంపతులకు విక్రయించగా, మిగిలిన ఐదు భాగాలను వేరే వ్యక్తులకు అమ్మ జూపారు. దీంతో నిందితులైన దుబాయ్ శ్రీను, పిల్లి అశోక్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కేసు విచారణలో ప్రతిభ కనబరిచిన సీఐ బాలకృష్ణ, ఎస్ఐ భాస్కరరావులను ఏసీపీ అప్పలరాజు అభినందించారు.

పాలిటెక్నిక్ ఫైనల్ కౌన్సెలింగ్ ప్రారంభం

మురళీనగర్: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఆఖరి దశ కౌన్సెలింగ్ గురువారం ప్రారంభమైంది. ఇంతవరకు సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోని వారు ఆన్‌లైన్ ద్వారా ప్రాసెసింగ్ ఫీజు చెల్లించారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ కెమికల్ ఇనిస్టిట్యూట్, పెందుర్తి పాలిటెక్నిక్ కాలేజీల్లో శుక్రవారం అన్ని ర్యాంకుల వారికి సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారు. ఈనెల 21వ తేదీన సీట్లు కేటాయిస్తారు.

డిజిటల్ యుగంలో నాణ్యమైన విద్య అవసరం

ఐఐక్యూఏ సీఈవో డాక్టర్ టి.రవీందర్ రెడ్డి

మద్దిలపాలెం: డిజిటల్ యుగంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్వాలిటీ అక్రిడిటేషన్ (ఐఐక్యూఏ) సీఈవో డాక్టర్ టి.రవీందర్ రెడ్డి అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న శతాబ్ది వాణి కార్యక్రమంలో గురువారం ఆయన ప్రసంగించారు. సాంకేతికత నేడు బోధన, అభ్యసన రంగాల్లోకి ప్రవేశించిందని చెప్పారు. కమ్యూనికేషన్, ప్రజెంటేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు నేడు ఏఐతో పోటీ పడాల్సిన అవసరం ఏర్పడుతోందని చెప్పారు. జ్ఞానం, నైపుణ్యాలు, వ్యక్తిత్వం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. క్యూఎస్ ర్యాంకింగ్, నాక్ ర్యాంకింగ్ వంటివి సాధించడం ద్వారా మెరుగైన ప్రమాణాలను నిలుపుకోవడం సాధ్యపడుతుందని తెలిపారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ గ్లోబల్ కాంపిటీషన్‌కు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలు కార్పొరేట్ వ్యవస్థలతో పోటీ పడాల్సిన అవసరం ఉందని చెప్పారు. కళాశాలలు వివిధ గుర్తింపులకు దరఖాస్తు చేయాలని, తద్వారా కళాశాలల్లో నాణ్యత ప్రమాణాలు మెరుగవుతాయని అన్నారు.



ఐఐక్యూఏ సీఈవో డాక్టర్ రవీందర్ రెడ్డిని సత్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

'సాంకేతిక' విద్యార్థుల ఆందోళన



యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘ ప్రతినిధులు



కళాశాల భవనం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

- యాజమాన్యం తీరును నిరసిస్తూ.. మూకుమ్మడిగా తరగతుల బహిష్కరణ
- కళాశాల టైమింగ్స్ పెంచడంతో భగ్గుమన్న విద్యార్థిలోకం
- మద్దతు పలికిన ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు
- సోమవారం నిర్ణయం ప్రకటిస్తామన్న యాజమాన్యం

మధురవాడ: ఆళ్వార్‌దాస్ విద్యా సంస్థలకు చెందిన సాంకేతిక విద్యాపరిషత్ కళాశాల విద్యార్థులు ఆగ్రహించారు. యాజమాన్యం తీరును నిరసిస్తూ గురువారం ఉదయం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. యాజమాన్యం కనీస సదుపాయాలను కల్పించడం లేదని, కళాశాల వేళలను ఏకపక్షంగా మార్చిందని ఆరోపిస్తూ.. సుమారు 2,500 మంది ఇంజినీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్ విద్యార్థులు మూకుమ్మడిగా తరగతులు బహిష్కరించారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా కళాశాల ప్రధాన భవనం ఎదుట ప్లకార్డులు పట్టుకుని, యాజమాన్య తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. 'మాకు న్యాయం కావాలి' అంటూ గట్టిగా నినాదాలు చేశారు. పీఎంపాలెం క్రికెట్ స్టేడియం సమీపంలోని ఈ కళాశాలలో జరిగిన ఆందోళన నగరంలో చర్చనీయాంశమైంది.

ఇవీ విద్యార్థుల ఫిర్యాదులు

- ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.10 గంటల వరకు ఉన్న కాలేజీ వేళల సమయాన్ని 9 గంటల నుంచి 5 గంటల వరకు పెంచడం.
- కేవలం 5 నిమిషాలు ఆలస్యమైనా హాజరు వేయకపోవడం, హాజరు తక్కువైతే 'కోఆర్డినేషన్'పేరుతో భారీ జరిమానాలు వసూలు చేయడం.
- యూడీఎఫ్ పేరుతో బిల్డింగ్ ఫీజు ఎక్కడా లేని విధంగా రూ. 9,000 వసూలు చేయడం, ఆలస్య రుసుం రోజుకు రూ. 200 విధించడం.
- ఫీజు బకాయిలున్న విద్యార్థులకు పరీక్ష హాల్‌టికెట్లు ఇవ్వకపోవడం.
- సాయంత్రం 5.30 వరకు కాలేజీ వేళలు ఉండటంతో అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వచ్చినా గేట్లు తెరవకపోవడం. అనకాపల్లి, పెందుర్తి, ఎస్.కోట వంటి సుదూర ప్రాంతాల విద్యార్థులు ఇంటికి చేరుకునే సరికి రాత్రి అవుతోందని ఆవేదన.
- ఫ్యాకల్టీ సరిగా లేరు. ఫ్యాన్లు కూడా సరిగా తిరగడం లేదు.
- ఇంటి నుంచి టిఫిన్ తెచ్చుకున్నా క్యాంటీన్‌లో తిననివ్వకపోవడం.

తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలు

బి.ఫార్మసీ విద్యార్థులు అయితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీరు, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ లేదని, రెండు రోజుల పాటు పూర్తిగా నీరు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడ్డామని పేర్కొన్నారు. ల్యాబ్‌లలో కూడా నీరు లేదని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

బెదిరింపులు, వేధింపులు

ఒకవేళ ఎవరైనా యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే.. తమ వద్ద ప్రాక్టికల్స్ మార్కులు, సర్టిఫికెట్లు ఉన్నాయని బెదిరిస్తోందని, బ్రేక్ టైం కూడా తీసేశారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ మద్దతు

ఈ ఆందోళనకు స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) విశాఖ జిల్లా కమిటీ మద్దతు తెలిపింది. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె.నాయుడుతో పాటు భరత్, నిఖిల్, సూర్య తదితర నాయకులు కాలేజీకి చేరుకుని విద్యార్థులతో కలిసి యాజమాన్యంతో చర్చలు జరిపారు. పీఎంపాలెం పోలీసు ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐలు భాస్కరరావు, రాము తమ సిబ్బందితో చేరుకుని విద్యార్థులను సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.

సోమవారం వరకు గడువు

విద్యార్థి సంఘ నాయకుల సమక్షంలో యాజమాన్యంతో జరిగిన చర్చల్లో.. సోమవారం లోపు తమ సమస్యలు పరిష్కారం చేయకపోతే నిరవధికంగా తరగతులు బహిష్కరిస్తామని విద్యార్థులు స్పష్టం చేశారు. విద్యార్థులకు మంచి విద్యనందించి, ఫలితాలు పెంచేందుకే వేళలు పెంచామని యాజమాన్య ప్రతినిధులు వివరించారు. తాము కూడా విద్యార్థుల ఇబ్బందులను బోర్డు డైరెక్టర్ల దృష్టికి తీసుకెళ్లి.. సోమవారం నిర్ణయం ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళనను తాత్కాలికంగా విరమించారు.

కారు దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

ఎంవీపీకాలనీ: కారు దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో ద్వారకా క్రైం ఏసీపీ లక్ష్మణరావు వివరాలను వెల్లడించారు. ఈ నెల 13న లాసన్స్ బే కాలనీకి చెందిన తిరుమలరాజు సమతారాజు (34) ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లాడు. ఇంటితాళాలను షూ ర్యాక్‌లో పెట్టాడు. తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లో పెట్టిన కారు తాళాలు కనిపించలేదు. పార్కింగ్‌లో చూడగా కారు కూడా లేదు. దీంతో ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలను పరిశీలించి దొంగతనానికి పాల్పడింది పాత నేరస్తుడు వాసుపల్లి ఎల్లాజీగా గుర్తించారు. అతని ఫోన్ ట్రాక్ చేసి గురువారం ఎంవీపీ సెక్టార్-11లో అరెస్ట్ చేశారు. అతని నుంచి ఐ20 కారుతో పాటు మరో ద్విచక్రవాహన్ని స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో క్రైం సీఐ చక్రధర్‌రావు, ఎస్ఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురు అరెస్టు

పరారీలో మరో నిందితుడు

అల్లిపురం: ప్రకాశరావుపేటలో ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి జరిగిన చెట్టి ఎల్లాజీ అలియాస్ వట్టి (21) హత్య కేసులో టూటౌన్ పోలీసులు నలుగురు యువకులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపిన వివరాలివి.. హత్య కేసులో ప్రధాన నిందితుడు, మృతుడు ఎల్లాజీ స్నేహితుడైన కొత్తసాలిపేటకు చెందిన గొలగాని శరత్ అలియాస్ అయ్యప్ప, చోడివీధికి చెందిన గరుగుబిల్లి దుర్గా ప్రసాదు అలియాస్ యాదర దుర్గ, గంజిపేటకు చెందిన కోన పృథ్వీ అలియాస్ పండు, ఆరిలోవ దుర్గాబజార్‌కు చెందిన దండేటి సాయి అలియాస్ మణికంఠ సాయిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో మరో నిందితుడు ఆదర్శ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

న్యూడ్ వీడియో వివాదం

యువకులపై దాడి, పోలీసులకు ఫిర్యాదు

తాటిచెట్లపాలెం: లాడ్జిలో దిగిన మహిళ న్యూడ్ వీడియోలు తీస్తున్నారనే ఆరోపణలతో బాయ్స్ హాస్టల్ యువకులను ఆమె సంబంధీకులు కొట్టారు. ఇందులో తమ తప్పులేకపోయినా కొట్టారని ఆ యువకులు సీపీని ఆశ్రయించారు. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాలివి.. ఆశీలమెట్ట శ్రీనగర్‌లో లాడ్జి, బాయ్స్ హాస్టల్ పక్కపక్కనే ఉన్నాయి. బుధవారం రాత్రి లాడ్జిలో సందీప్, ఒక యువతి ప్రేమికులమని దిగారు. కాగా.. ఆమె న్యూడ్ వీడియో చిత్రీకరిస్తున్నారనే ఆరోపణలతో బాయ్స్ హాస్టల్ వార్డెన్ రమేష్, మరో ముగ్గురు యువకులను సందీప్, అతని స్నేహితులు చితకబాదారు. అనంతరం ఇరువర్గాలకు పోలీసులు కౌన్సెలింగ్ చేశారు. అయితే తమను అనవసరంగా కొట్టారని, తాము వీడియోలు తీయలేదని హాస్టల్ వార్డెన్, యువకులు గురువారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో ఇరువర్గాల వారిని మళ్లీ ద్వారకా పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. సీఐ రమణ పర్యవేక్షణలో విచారణ కొనసాగింది.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

విశాఖ సిటీ: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారీటైం అండ్ షిప్ బిల్డింగ్(సెమ్స్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపీకృష్ణశివమ్(రిటైర్డ్) ఒక ప్రకటనలో తెలిపారు. 27 ఏళ్లలోపు బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్, డిప్లమో, ఐటీఐలో ఫిట్టర్, టర్నర్, ఇంటర్, డిగ్రీ, 10వ తరగతి ఉత్తీర్ణులైన విశాఖ పరిధిలోని నిరుద్యోగ యువత దీనికి అర్హులని వెల్లడించారు. వీరికి ప్రొడక్ట్ డిజైన్ ఇంజనీరింగ్, సీఎన్‌సీ ఆపరేటర్, సీఎన్‌సీ ప్రోగ్రామర్, ఇన్వెంటరీ క్లర్క్, వేర్‌హౌస్ పికర్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, కొరియర్ సూపర్‌వైజర్ కోర్సుల్లో 2 లేదా 5 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి సహకారం ఉంటుందని చెప్పారు. పోర్టు పరిసర ప్రాంతాల్లోని తెల్లరేషన్‌కార్డు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు సింధియా జంక్షన్‌లోని సెమ్స్ కేంద్రంలో గానీ, 8688411100, 8331901237, 0891-2704010 నెంబర్లకు సంప్రదించి ఈ నెల 22 తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

క్యాంటీన్ వేలం ఎందుకు ఆపేశారూ..?

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ ఒకటో నెంబరు క్యాంటీన్ వేలం ప్రక్రియను దేవస్థానం అధికారులు నిర్వహించకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఫోన్ చేయడం వల్లే వేలం ప్రక్రియను దేవస్థానం అధికారులు నిలుపుదల చేసినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. దేవస్థానంలో పలు వ్యాపారాలు చేసుకునేందుకు ఈనెల 16న బహిరంగ వేలం దేవస్థానం అధికారులు నిర్వహించారు. ఏయే వాటికి బహిరంగ వేలం నిర్వహిస్తారో 20 రోజుల క్రితమే నోటిఫికేషన్ ఇచ్చారు. కొండదిగువ క్యాంటీన్ నెంబర్-1 గడువు తేదీ ముగిసిపోతుండటంతో ఆ అంశాన్ని కూడా నోటిఫికేషన్‌లో 5వ నెంబరు అంశంగా పొందుపరిచారు. ఈనెల 16న దేవస్థానం పరిపాలన కార్యాలయంలో జరిగిన వేలంలో క్యాంటీన్-1కి మాత్రం వేలం నిర్వహించలేదు. దీంతో పలువురు పాటదారులు నిరాశ చెందారు. ఎందుకు వేలం పెట్టడం లేదని అధికారులను ప్రశ్నించినా వారి వద్ద సమాధానం లేదు. ప్రస్తుతం క్యాంటీన్-1 నిర్వహిస్తున్నవారంతా టీడీపీ చెందిన వారే కావడంతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దేవస్థానం ఈవోకి ఫోన్ చేసి వేలం ప్రక్రియ నిలుపుదల చేయాలని చెప్పినట్లు తెలుస్తోంది. ఇదిలావుండగా కొండదిగువ క్యాంటీన్ నెంబర్-2ని గత కొన్నేళ్ల నుంచి వేలం ప్రక్రియలో పెట్టకపోవడంపై పలువురు ప్రశ్నిస్తున్నారు.

మెట్రో ప్రాజెక్టు భూసేకరణకు ప్రజాభిప్రాయ సేకరణ

సీతంపేట: విశాఖపట్నం మెట్రోరైల్ ప్రాజెక్టు ఫేజ్-1 (కారిడార్ 1, 2, 3) నిర్మాణానికి సంబంధించి భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. గురువారం ఉదయం అక్కయ్యపాలెంలోని అబిద్‌నగర్‌లోని షాదీఖానా కల్యాణ మండపం, గురుద్వారా జంక్షన్, ఆశీల్‌మెట్టలోని వేమన మందిరంలో జోనల్ కమిషనర్లు బి.రాము, కె. శివప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కారిడార్ 1, 3లకు సంబంధించిన భూములు, నివాస, వ్యాపార, ఖాళీ స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులు, ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐఏ టీమ్ సామాజిక నిపుణుడు పి. దేవరాజు మాట్లాడుతూ మెట్రోరైల్ ప్రాజెక్టు భూసేకరణలో మొత్తం 312 గృహ, వ్యాపార, ఖాళీ స్థలాలకు నష్టం జరుగుతుందన్నారు. కారిడార్ 1లో 74 ఇళ్లు, ప్రహరీ గోడలు, ఖాళీ స్థలాలు పాక్షికంగా, 20 ఇళ్లు పూర్తిగా నష్టపోతాయని తెలిపారు. కారిడార్ 3లో 3 ఇళ్లు పూర్తిగా, 23 ఇళ్లు కొంత మేర నష్టపోతాయని వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు, ప్రజల నుంచి ఈ ప్రాజెక్టుపై అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరించారు. ఎక్కువ మంది నిర్వాసితులు స్టేషన్ పాయింట్లను ప్రైవేటు ఆస్తుల్లో కాకుండా ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల సేకరించిన అభిప్రాయాలు, సూచనలను రికార్డు చేసి.. కలెక్టర్‌కు నివేదికను సమర్పిస్తామన్నారు. ఎస్ఐఏ టీమ్ పర్యావరణ సామాజిక నిపుణుడు ఎ.మాధవరెడ్డి, మెట్రో ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధాసాగర్, డిప్యూటీ తహసీల్దార్ పద్మావతి, సర్వేయర్ శ్రీనుబాబు, ఆర్ఐ మురళీకృష్ణ, గాజువాక తహసీల్దార్ శ్రీనివాస్, మెట్రో రైల్ ప్రాజెక్టు ఇంజనీర్లు ఎన్. వసంత్, కె.ఎ.పరదేశిబాబు, కె.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సామాజిక నిపుణులు పి.దేవరాజు

రేపు బీచ్‌రోడ్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

అల్లిపురం: ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఆర్కే బీచ్ రోడ్‌లో జరగనున్న తలసేమియా రన్ (10కే, 5కే, 3కే) సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఆలిండియా రేడియో జంక్షన్, ఎన్టీఆర్ జంక్షన్, పందిమెట్ట జంక్షన్, ఎన్‌సీబీ జంక్షన్, పార్క్ హోటల్ జంక్షన్, కురుపాం సర్కిల్, జోడుగుళ్ల పాలెం జంక్షన్లలో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయి. నగర ప్రజలు పోలీసులకు సహకరించాలని కమిషనర్ కోరారు.